క్లుప్తంగా

మండలి డిప్యూటీ చైర్మన్‌ను కలిసిన నాయకులు



బండా ప్రకాశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్: శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండారు ప్రకాశ్‌ను బుధవారం హైదరాబద్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన బీసీ సంఘం నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని బీసీ నేతలు ఆయనను కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మిర్యాలగూడ నియోజకవర్గ కన్వీనర్ జాజుల లింగంగౌడ్, పానుగంటి విజయ్, మల్లికార్జున్‌యాదవ్ తదితరులున్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

అడవిదేవులపల్లి: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని బీజేపీ మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ పాలక్, సినీ నటి కవిత అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని మొల్కచర్ల గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా గోస–బీజేపీ భరోసా కార్య క్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యానికి హాని కల్గించే కార్పస్ మొక్కలను నాటించి ప్రజల జీవితాలతో కేసీఆర్ చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు సాధినేని శ్రీనివాస్‌రావు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు చలమల సీతారాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పెద్దింటి కొండలు, సైదయ్య, మంతనాయక్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలని వినతి

అడవిదేవులపల్లి: యాదాద్రి పవర్ ప్లాంట్‌కు కృష్ణానది నుంచి నీటిని తరలించేందుకు వేస్తున్న పైపులైన్ కింద ప్రభుత్వం కేటాయించిన భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని బుధవారం మండల ఇన్‌చార్జి తహసీల్దార్ రఘుకు పలువురు రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పట్టా భూమి ఉన్న రైతులకు ఏవిధంగా నష్టపరిహారం ఇప్పించారో.. అదేవిధంగా ప్రభుత్వ భూముల్లో సేద్యం చేసుకుంటున్న సన్న, చిన్నకారు రైతులకు కూడా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో రైతులు కేశబోయిన మల్లయ్య, బండి ఆంజనేయులు, భైరం ఏడుకొండలు, ఎర్రమల్ల వెంకటేశ్వర్లు, చింతల వీరయ్య, బండి ఆదినారాయణ తదితరులున్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

హాలియా: మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ మంగ, మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 286లో గల అనన్య వెంచర్‌లో బుధవారం మున్సిపల్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని అనన్య వెంచర్ నిర్వాహకుడు ఆక్రమించినట్లు ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త లింగాల ప్రభాకర్ ఇటీవల అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు చేశాడు. కాగా 500 మీటర్ల ప్రభుత్వ స్థలాన్ని వెంచర్ నిర్వాహకుడు ఆక్రమించి ప్రహరీ నిర్మించినట్లు విచారణలో తేలిందన్నారు. ప్రహరీని జేసీబీతోతొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు.

ఎమ్మెల్యేపై సర్పంచ్ ఆరోపణలు నిరాధారం



కలెక్టర్ ఇచ్చిన అనుమతి పత్రాలను చూపిస్తున్న ఎంపీపీ తదితరులు

దేవరకొండ: దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌పై మండల పరిధిలోని తాటికోల్ గ్రామ సర్పంచ్ జూలూరి ధనలక్ష్మి చేసిన ఆరోపణలు నిరాధారమైనవని ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకుడు మారుపాకుల సురేష్‌గౌడ్ అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. కొండభీమనపల్లి సర్పంచ్ విద్యావతి గ్రామంలో చేపడుతున్న సీసీ రోడ్డు ఎనులకు తాటికోల్ వాగు నుంచి ఇసుకను తరలించేందుకు జిల్లా కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎమ్మెల్యే, మండల ప్రజాప్రతినిధులపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని అన్నారు. వెంటనే ఎమ్మెల్యేకు సర్పంచ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్‌గౌడ్, రైతు బంధు అధ్యక్షుడు శిరందాసు కృష్ణయ్య, రాష్ట్ర నాయకులు హనుమంతు వెంకటేష్‌గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పన్ను వసూళ్లే లక్ష్యం

- ఆస్తి పన్ను వసూళ్లపై మున్సిపల్ అధికారుల ప్రత్యేక దృష్టి
- మొండి బకాయిదారులకు నోటీసులు జారీ
- దేవరకొండ మున్సిపాలిటీలో ఇప్పటి వరకు 51.13 శాతం వసూలు



ఆస్తి పన్ను చెల్లించిన వారికి రశీదు అందజేస్తున్న కమిషనర్ వెంకటయ్య

దేవరకొండ: మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరైన ఆస్తి పన్ను వసూళ్లపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు సమయం ఆసన్నం అవుతుండడంతో వంద శాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో పన్నులను రాబట్టాలని మున్సిపల్ అధికారులు వార్డుల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మొండి బకాయిదారుల వివరాలతో కూడిన జాబితాను సిద్ధం చేసి వారికి నోటీసులు అందజేసే పనిలో పడింది మున్సిపల్ యంత్రాంగం.

అధికారుల ప్రత్యే దృష్టి..

దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో వంద శాతం పన్నుల వసూళ్ల కోసం మున్సిపల్ అధికారులు ప్రచార సాధనాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు ఎక్కువ మొత్తంలో బకాయిలు ఉన్నవారికి నోటీసులు సైతం ఇస్తున్నారు. పన్నుల వివరాలను గృహాల యజమానులకు సెల్‌ఫోన్‌ల ద్వారా మెసేజ్‌లు పంపుతున్నారు. ఇప్పటి వరకు 51.13శాతం పన్నులు వసూలు అయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలో 6,867 అసెస్‌మెంట్లు ఉండగా ఇందుకుగాను దాదాపు రూ.3.25 కోట్ల మేర ఆస్తి పన్ను వసూలు లక్ష్యంగా ఉంది. కాగా ఇప్పటి వరకు రూ.1.66 కోట్లు వసూలు కాగా, మరో రూ.1.74 కోట్ల మేర బకాయిలు ఉన్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు.

ఈసారి రాయితీలు లేవు..

కోవిడ్ నేపథ్యంలో గత రెండేళ్లు ఆర్థిక సంవత్సరం మొదట్లో పన్నుల వసూళ్లు పూర్తిగా మందగించాయి. 2020–21సంవత్సరానికి సంబంధించి రూ.10వేల లోపు ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం ఊరట కల్పించింది. చెల్లించే మొత్తంపై 50శాతం మాఫీ ప్రకటించింది. దీంతో అప్పట్లో చాలావరకు పన్నులు వసూలు అయ్యాయి. అదే విధంగా మొండి బకాయిలకు సంబంధించి 90శాతం రాయితీ కల్పించింది. వీటి కారణంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న చాలా వరకు బకాయిలు వసూలు అయ్యాయి. ప్రస్తుతం 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి రాయితీ ప్రకటన రాలేదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని మున్సిపాలిటీల్లో వంద శాతం పన్ను వసూలు చేసే లక్ష్యంగా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తున్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి



దేవరకొండ మున్సిపాలిటీలో వంద శాతం ఆస్తి పన్ను వసూలుకు చర్యలు చేపట్టాం. వార్డుల వారీగా టీంలను ఏర్పాటు చేసి ఇంటింటికి వెళ్లి పన్నులు వసూలు చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొండి బకాయిదారుల వివరాలను సేకరించి నోటీసులు జారీ చేస్తున్నాం. ప్రజలు సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి.

– వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్, దేవరకొండ మున్సిపాలిటీ

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండ మండలానికి చెందిన 33మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, జెడ్పీటీసీ మారుపాకుల అరుణ, తహసీల్దార్ రాజు, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్‌గౌడ్, శిరందాసు కృష్ణయ్య, రహత్ అలీ, హన్మంతు వెంకటేష్‌గౌడ్, శ్రీనునాయక్, ఇద్దయ్య, రయీస్ పాల్గొన్నారు.

పేదలను ఆదుకునేందుకే సంక్షేమ పథకాలు

- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే భగత్



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే భగత్

హాలియా: రాష్ట్రంలోని నిరుపేదలను ఆదుకునేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. బుధవారం హాలియా పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో అనుముల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 88 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మ, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ మాలే అరుణ, తహసీల్దార్ మంగ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామలింగయ్య, మున్సిపాలిటీ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని పేరూర్‌లో నిర్వహించే సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాల పోస్టర్లను హాలియాలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భగత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, వికారాబాద్ సీఐ ఆర్కపల్లి ఆంజనేయులు, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి యనమల సత్యం, మార్కెట్ డైరెక్టర్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



మాల్ వెంకటేశ్వరనగర్‌లో మాట్లాడుతున్న దేవరకొండ మాజీ ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా బుధవారం మండలంలోని మాల్ వెంకటేశ్వరనగర్, గొడుకొండ్ల, పోలేపల్లిరాంనగర్, రోటిగడ్డతండా, ఎర్రమట్టితండా, మదనాపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించి, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజేశారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని గొప్పలు చెప్పకుంటున్న ప్రభుత్వం కనీసం నాలుగు గంటలు కూడా కరెంట్ ఇవ్వడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో కేతావత్ బిల్యానాయక్, ఎంపీపీ కొండూరు భవానీ, కిషన్‌నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, ముచ్చర్ల యాదగిరి, అంగిరేకుల గోవర్ధన్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మభిక్షం ఆశయ సాధనకు కృషిచేయాలి



దేవరకొండ: ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేస్తున్న పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు

దేవరకొండ: రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ధర్మభిక్షం 101వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, వెంకటరమణ, పార్లపల్లి కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాద్గార్‌పల్లి గ్రామంలో..

మిర్యాలగూడ అర్బన్: మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో బుధవారం గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో బొమ్మగాని ధర్మభిక్షం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మభిక్షం చిత్రపటానికి గ్రామానికి చెందిన 110 ఏళ్ల గీత కార్మికుడు బంటు నర్సయ్య చేతుల మీదుగా పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, గ్రామ సొసైటీ ఉద్యోగులు గువ్వల అంజయ్య, ఆకిటి రామస్వామి తదితరులున్నారు.

నిరంతరాయంగా సాగునీరు విడుదల

- మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



చెస్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ: నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ద్వారా సాగునీటి విడుదలకు గురువారంతో వారబందీ విధానం ముగుస్తున్నందున, ఆ విధానాన్ని నిలిపివేసి వ్యవసాయానికి నిరంతరాయంగా నీటిని విడుదల చేపడుతున్నట్లు ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాగర్ ఆయకట్టులో రైతులు సాగుచేసిన పంట పొలాలు ఎండిపోతున్నందున ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి గురువారం నుంచి సాగునీటిని నిరంతరాయంగా విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే

కోదాడలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జిల్లా చెస్ పోటీల్లో అండర్–13 విభాగంలో మిర్యాలగూడకు చెందిన శ్రీవైష్ణవ్ ద్వితీయ స్థానం సాధించాడు. అండర్–13 విభాగంలో బెస్ట్ ప్లేయర్‌గా సాయిప్రణీత్ నిలిచాడు. అండర్–11 విభాగంలో చిద్విలాసిని ప్రథమ స్థానం, అండర్–9 విభాగంలో శ్రీవాత్సవ ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రతిభ చూపిన విద్యార్థులతో పాటు కోచ్ వరప్రసాద్‌ను మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అభినందించారు.

‘ఉపాధి హామీ’ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర

చందంపేట: కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి తక్కువ నిధులు కేటాయించి ఆ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లూరి నర్సింహ ఆరోపించారు. బుధవారం మండలంలోని ముడుదండ్ల గ్రామంలో నిర్వహించిన సంఘం మండల మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ నిధులను తక్షణమే విడుదల చేయాలన్నారు. పోడు రైతులకు ఎలాంటి షరతులు లేకుండా పట్టాలు ఇవ్వాలని, విద్యుత్ సరఫరా కల్పించాలని డిమాండ్ చేశారు. మండలంలో ఇళ్ల స్థలాలు ఉన్న వారికి ఇళ్లు నిర్మించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలు ఇవ్వాలని, ఇంటి స్థలాలు లేని వారికి ప్రభుత్వమే ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలయ్య, సీపీఐ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, గుమ్మకొండ శేఖర్‌రెడ్డి, రమావత్ శ్రీనునాయక్, రాములు, మల్లయ్య, శంకర్, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

24గంటల విద్యుత్ ఇవ్వాలి



శెట్టిపాలెంలో ఎండిపోతున్న పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్

మిర్యాలగూడ: రాష్ట్రంలో వ్యవసాయానికి 24గంటల విద్యుత్ అందిస్తున్నామని చెప్పి రైతులను సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులో నీరు లేక ఎండిపోతున్న పంట పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలగాని వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు పల్లా వెంకటయ్య, కంచర్ల వెంకట్‌రెడ్డి, బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త పార్టీ

తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సకల జనుల రాజ్యాధికార చైతన్య చిత్ర పేరుతో కొత్త పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రజల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు తాను చొక్కా ధరించనని ప్రకటించారు. ఆగస్టు 15న పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా రూపుదిద్దుకుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌గౌడ్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు న్యాయం చేయాలి

మిర్యాలగూడ: తన భర్త పేరు మీద ఉన్న భూమిని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని, రెవెన్యూ తనకు న్యాయం చేయాలని బాధితురాలు విమల డిమాండ్ చేశారు. బుధవారం ఆమె మిర్యాలగూడ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామంలోని సర్వే నంబర్ 418ఈలో 1.26గుంటలు, సర్వే నంబర్ 414లో 19గుంటలతో పాటు ఇతర సర్వే నంబర్లలోని మరికొంత భూమితో కలుపుకొని మొత్తం సుమారు రెండెకరాల భూమి తన భర్త చెన్నూరు మురళీధర్‌కు వంశపారంపర్యంగా వచ్చిందన్నారు. తన భర్త చనిపోవడంతో ఆ భూమిని తనకు రాకుండా గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేశారని ఆరోపించారు. భూమిని నాకు ఇప్పించాలని 2018 నుంచి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఆ భూమి నిషేధిత జాబితాలో ఉందని, ఇటీవలే ధరణి ద్వారా తొలగిపోయిందన్నారు. తన భర్త పేరు మీద భూమిని తన పేరు మీద మార్చి పాసుపుస్తకాలు అందించాలని ఆమె కోరారు.

ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు



కొండమల్లేపల్లి: సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్



దేవరకొండ: సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న బీఎస్పీ నాయకులు

కొండమల్లేపల్లి: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని బుధవారం కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పూలమాల వేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కుంభం శ్రీనివాస్‌గౌడ్, పస్నూరి యుగేంధర్‌రెడ్డి, రమావత్ దస్రూనాయక్, గంధం సురేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో సేవాలాల్ చిత్రపటానికి ఎంపీపీ దూదిపాల రేఖ, వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు తదితరులు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎండీ ఖదీర్, రమావత్ సేవానాయక్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండలో..


దేవరకొండ: దేవరకొండ పట్టణంలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సేవాలాల్ చిత్రపటానికి బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్ర కృష్ణ పూలమాలలు వేశారు. కార్యక్రమంలో డా. ఏకుల రాజారావు, లలిత, ఎర్ర యాదయ్య, కూర శ్రీకాంత్, శ్రీరాములు, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో..


మిర్యాలగూడ: దామరచర్ల మండలంలోని కల్లెపల్లి గ్రామంలో సేవాలాల్ జయంతి ఉత్సవాలు, బోగ్ బండార్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో మిర్యాలగూడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో..

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకలు, బోగ్ బండార్ కార్యక్రమానికి ఎంఈఓ బాలాజీనాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం బోగ్ బండార్‌లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ముజుబుద్దీన్, రాజరత్నం, సక్రు, తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్ర కృష్ణకాంత్‌నాయక్, బాలునాయక్, సేవాలాల్ జయంతి కన్వీనర్ మూడ్ రవినాయక్ పాల్గొన్నారు.



మిర్యాలగూడ: సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ టౌన్: గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో భోగ్ బండార్ కార్యక్రమం

సంక్షిప్త సమాచారం

ఏరియా ఆస్పత్రిలో అల్పాహారం అందజేత

మిర్యాలగూడ అర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రోగుల బంధువులకు బుధవారం రిటైర్డ్ వీఆర్‌ఓ విశ్వనాథశాస్త్రి చేతుల మీదుగా అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌సీ మాశెట్టి శ్రీనివాస్, డాక్టర్ నవీన్, వాసవి, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

చందంపేట: మండలంలోని తెల్దేవర్‌పల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ఎంపీపీ పార్వతి ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ చందులాల్ నాయక్, లక్ష్మనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన

డిండి: మండల కేంద్రంలోని డీఎన్‌టీ కాలనీ సమీపంలో చేపట్టిన మిషన్ భగీరథ ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణానికి బుధవారం సర్పంచ్ మేకల సాయమ్మ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ నగేష్, ఎస్ఎంసీ చైర్మన్‌లు రామస్వామి, తిరుపతయ్య, వార్డు సభ్యుడు నిరంజన్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నిడమనూరు: అనుముల మండల పరిధిలోని శ్రీనాథపురం వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను నిడమనూరు మండలంలోకి రవాణా చేస్తుండగా మూడు ట్రాక్టర్లను బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ శోభన్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు శ్రీనాథపురానికి చెందిన సంద్రాల సైదులు, కాంసాని సైదులు, చక్క మహేష్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

నిడమనూరు: మండలంలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన గాదె కృష్ణ, రమణ దంపతుల కుమారుడు హేమంత్ కొంతకాలంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న నిడమనూరు ఎస్ఐ శోభన్‌బాబు బుధవారం వారికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

కోరం లేక చైర్మన్ ఎన్నిక వాయిదా

మిర్యాలగూడ: వేములపల్లి మండలంలోని ఆమనగల్లు నల్ల చెరువు మత్స్య పారిశ్రామిక సంఘం చైర్మన్, వైస్ చైర్మన్, కార్యదర్శిని బుధవారం ఎన్నుకోవాల్సి ఉండగా, సరైన కోరం లేక వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి కె. సురేష్‌కుమార్ తెలిపారు. మొత్తం 9మంది డైరెక్టర్లకు గాను ముగ్గురు మాత్రమే హాజరుకావడంతో ఎన్నికను గురువారానికి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

పెద్దవూర: బీసీ రిజర్వేషన్ పెంపు కోసం దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణలో భాగంగా మండల కేంద్రంలో బుధవారం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ ఇన్‌చార్జి ఆదిమల్ల వెంకటేశ్, ఎల్‌పీహెచ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రమావత్ సక్రునాయక్, బత్తుల ప్రసాద్, రమేశ్‌రాథోడ్, రేపాక నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలి

మిర్యాలగూడ: వేములపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛ భారత్ గ్రామీణ మిషన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఎంపీపీ పుట్టల సునీత ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త వేరు చేయడం, పారిశుద్ధ్య నిర్వహణ పట్ల ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, జి. శంకర్‌బాబు, ఏపీఓలు మొయినొద్దీన్, శ్రీనివాస్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో ప్రచారం

కొండమల్లేపల్లి: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి గుర్రం చెన్న కేశవరెడ్డిని గెలిపించాలని బుధవారం కొండమల్లేపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, నరసింహానాయక్, కాలం నారాయణరెడ్డి, వాసికర్ల రమేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మనుధర్మ శాస్త్రం పాఠ్యాంశంగా వద్దు

మిర్యాలగూడ: మనుధర్మ శాస్త్రాన్ని యూనివర్సిటీల్లో పాఠ్యాంశంగా ప్రవేశపెట్టొద్దని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రెమడాల పరుశురాములు అన్నారు. బుధవారం దామరచర్ల మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని కాదని మనుస్మృతిని తిరిగి తీసుకురావాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు.

ఎన్‌సీడీ కిట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవూర: బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఎన్‌సీడీ కిట్లను బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రోగులకు ఎంపీపీ అనురాధ పంపిణీ చేశారు. అంతకుముందు పులిచెర్లలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నడ్డి లింగయ్య, మిట్టపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ పులిమాల కృష్ణారావు పాల్గొన్నారు.

నిరంతరాయంగా సాగునీరు అందించాలి

మిర్యాలగూడ: ప్రభుత్వం వారబందీని విరమించుకుని వజీరాబాద్ మేజర్ కాల్వ ద్వారా నిరంతరంగా సాగునీటిని అందించాలని రైతులు ధీరావత్ మాన్యనాయక్, దనావత్ సిద్ధునాయక్ బుధవారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో డీఈ బచ్చిబాబుకు వినతి పత్రం అందజేశారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

హాలియా: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అల్పాహారాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పార్వతమ్మ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గుండా కృష్ణమూర్తి, కౌన్సిలర్ సుధారాణి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని దుబ్బతండా వద్ద గల ఫెయిత్ బంజారా అనాథాశ్రమం, గిరిజన బాలికల హాస్టల్‌కు బుధవారం విస్టెజ్ కంపెనీ ప్రతినిధులు సుబ్బయ్యశెట్టి, ఎం. శ్రీనివాస్, గౌతమ్ బాలీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు ధీరావత్ హన్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి

మిర్యాలగూడ అర్బన్: ఉమ్మడి రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం భవనంలో మాలమహానాడు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులున్నారు.

‘నాపై సస్పెన్షన్ వర్తించదు’

మిర్యాలగూడ: ఇటీవల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలో భాగంగా డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ తనను సస్పెండ్ చేశారని, కానీ ఆ సస్పెన్షన్ తనకు వర్తించదని ఎంపీటీసీ బెజ్జం సాయి అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఘర్షణ జరిగిన రోజు తాను పార్టీ కార్యాలయంలో లేకున్నా పార్టీ నుంచి సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. దీనిపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్ముడబోయిన అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని అధికారంలోకి తీసుకురావాలి

మిర్యాలగూడ టౌన్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేలా శక్తి కేంద్రాలు పని చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, మిర్యాలగూడ నియోజకవర్గ కన్వీనర్ బాణావత్ రతన్‌సింగ్‌నాయక్, పట్టణ పార్టీ అధ్యక్షుడు దొండపాటి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని రెడ్డికాలనీలో నిర్వహించిన ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కొంపెల్లి సరిత, సహ ప్రముఖ సత్యప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.